RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :191 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 26 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 191 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 26 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసింది

### తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ చాలా అన్యాయం చేసిందని, ఆయనను తీవ్రంగా అవమానించిందని, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ చరిత్ర గురించి కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీకి

మిగతా 2లో

## తేజస్' యుద్ధ విమానంలో ప్రయాణించిన ప్రధాని



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌లో విహరించారు. ఆ ఫొటోలను ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. “తేజస్ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేశాను. ఈ అనుభవం చాలా అద్భుతంగా ఉంది. ఈ ప్రయాణంతో మన స్వదేశీ సామర్థ్యంపై నా విశ్వాసం మరింత పెరిగింది. మన దేశ శక్తి సామర్థ్యాల పట్ల నాకు గర్వంగా ఉంది. ఇది మన శాస్త్రవేత్తల కృషి, అంకితభావానికి నిదర్శనం. స్వావలంబనలో మనం ప్రపంచంలో ఎవరి

మిగతా 2లో

# బీజేపీతోనే.. తెలంగాణ సౌభాగ్యం

### ఎస్సీ వర్గీకరణ ప్రణాళికలు సిద్ధం : ప్రధాని మోడీ

రంగారెడ్డి- ప్రభాత సూర్యుడు


బీజేపీ మాట ఇస్తే దానిపై నిలబడుతుందని, 370 ఆర్టికల్‌ను రద్దు చేస్తామని చెప్పి చేసి చూపించామని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే.. సకల సౌభాగ్య తెలంగాణను ఇవ్వడమే లక్షమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి విముక్తిని కోరుకుంటున్నారన్నారు. బీజేపీ గెలిస్తే చెరకు రైతులకు తీపికబురు ఉంటుందని చెప్పారు. తెలంగాణలో ఇరిగేషన్ పథకాలను ఇరిగేషన్ స్కామ్‌లుగా మార్చారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక తరగతులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్యాయం చేశాయన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలో తెస్తే తొలి బీసీని సీఎం చేసే బాధ్యత తనదే అన్నారు. మోడీ మాట ఇస్తే తప్పడు అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో ప్రధాని మాట్లాడారు. కామారెడ్డి సభలో.. 'నా కుటుంబ సభ్యులారా' అని ప్రధాన మోడీ తన ప్రసంగానికి ముందు అనడంతో ప్రజల నుంచి హర్షద్వానాలు వినిపించాయి.



కేసీఆర్ అధికారంలోకి రాకముందు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి తనే ఆ కుర్చీని కబ్జా చేశాడని అన్నారు. సామాజిక సమన్వయ సాధికారత కోసమే బీజేపీ పని చేస్తుందని తెలిపారు. బీసీలకు తగిన గౌరవం ఇస్తూ వారికి సీట్లు కేటాయించామన్నారు. తెలంగాణ వికాస యాత్రలో మాదిగ సామాజిక తరగతికి అన్యాయం జరిగిందని, దాన్ని సవరించేందుకు

మిగతా 2లో

## రెస్క్యూ ఆపరేషన్‌కు మళ్లీ అడ్డంకి



డెహ్రాడూన్- ప్రభాత సూర్యుడు

ఉత్తరాఖండ్ సొరంగం రెస్క్యూ ఆపరేషన్ పూర్తౌతోందనుకునే లోపే అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఒక్కొక్క సవాలునీ దాటుకుని వస్తున్నా ఏదో ఆటంకం కలుగుతోంది. ఫలితంగా సహాయక చర్యల్లో జాప్యం జరుగుతోంది. అమెరికా నుంచి అగుర్ మిషన్ ని తెప్పించి డ్రిల్లింగ్ చేస్తున్నారు. అంతా సజావుగానే సాగుతోందనుకున్న సమయంలో డ్రిల్లింగ్‌కి అడ్డంకి ఎదురైంది. మరో 12 మీటర్లు డ్రిల్లింగ్ చేయాల్సి ఉండగా ఓ ఐరన్ బీమ్ అడ్డం తగిలింది. అప్పటి నుంచి రెస్క్యూ ఆపరేషన్ ఆగిపోయింది. ఏ అడ్డంకీ లేకపోయుంటే ఈ పాటికే లోపల చిక్కుకున్న 41 మంది కార్మికులు బయటకు వచ్చే వాళ్లు. ప్రస్తుతానికి మళ్లీ వర్టికల్ డ్రిల్లింగ్ చేపట్టే యోచనలో ఉన్నారు. రెస్క్యూ

మిగతా 2లో

## బీఆర్ఎస్ పాలనా అంతా మోసం

నల్గొండ - ప్రభాత సూర్యుడు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిగులు ఆదాయం ఉన్న తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో దివాలా తీసిందని కేంద్రం హోంమంత్రి అమిత్ షా అన్నారు. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో అవినీతి తప్ప ఏం చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో భూముల వేలంలో రూ.4 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు వేలంలో, కాళేశ్వరం ప్రాజెక్టులోనూ భారీగా అవకతవకలు

మిగతా 2లో



## నరేంద్రమోడీ నల్లచట్టాలు చేసి రైతులను మోసం చేస్తున్నారు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు

నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కేసీఆర్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారని.. అక్కడ మోడీ.. ఇక్కడ కేసీఆర్ ఒకటే అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బోధన్‌లో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ

మిగతా 2లో





## అమిత్ షా కాదు.. అబద్దాల బాద్ షా

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కోరుట్ల - ప్రభాత సూర్యుడు : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన పేరు అమిత్ షా కాదని, అబద్దాల బాద్ షాగా మార్చుకోవాలని సూచించారు. తమది నలుగురితో కూడిన కుటుంబం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలతో కూడిన కుటుంబమని తేల్చిచెప్పారు. తెలంగాణ కుటుంబంలోకి వచ్చి ఆ నాయకులు వైరుధ్యాలు సృష్టించలేరని, గొడవపెట్టలేరని సూచించారు. కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ అల్లర్లు జరిగేవని, గత పదేళ్లో ఎటాంటి అల్లర్లు లేకుండా సీఎం కేసీఆర్ పరిపాలన చేశారన్నారు. మనం అభివృద్ధి వైపు ఉందామా లేదా అరాచకం వైపు ఉందామా ? అన్నది తేల్చుకోవాలని ప్రజలను కోరారు.కోరుట్లకు వచ్చి షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని అమిత్ షా అన్నారని, ఎయిర్ ఇండియా వంటి పెద్దపెద్ద ప్రభుత్వ రంగ సంస్థలను మూసేసిన బీజేపీ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తదటా అని ఎద్దేవా చేశారు. అమిత్ షా ప్రకటన కనీసం నమ్మేటట్టు ఉందా అని అడిగారు. బోధన్ షుగర్ ఫ్యాకర్టీని ముంచిందే


మిగతా 2లో

# ఎవరు ఏం చేసినా కేసీఆర్ గెలవడు

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయల్ ఇంటి నుంచి వెయ్యి కోట్ల రూపాయల పంపిణీ జరిగిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇంకా ఆయన నివాసంలో రూ.300 కోట్లు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన తాము ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా సీఈఓ స్పందించలేదన్నారు. కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫోన్ నుంచి సీఈఓ వికాస్ రాజ్‌కి వంద సార్లు కాల్ చేసినా ఎత్తలేదని .. గోయల్ ఇంట్లో ఏం లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రైతు బంధు నిధుల జమకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడం ద్వారా బీజేపీ, బీఆర్ఎస్ బంధం మరోసారి బయటపడిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్, మోడీది ఫెవికాల్ బంధం బలపడిందని రైతుబంధు విషయంలో బీఆర్ఎస్ కు సహకరించేలా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చేలా బీజేపీనే చేసిందని ఆరోపించారు. కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకుని పోలింగ్ కు 4 రోజుల ముందు రైతుబంధు డబ్బులు వేస్తున్నారని, ప్రభుత్వ సొమ్ముతో ప్రజల ఓట్లు కొనాలని బీఆర్ఎస్ చూస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఓట్ల కొనుగోలుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే జనవరిలో రైతుబంధు వేస్తామని ఇప్పుడే రైతుబంధు వేయడం ద్వారా కౌలు రైతులు నష్టపోతారన్నారు. బీఆర్ఎస్ వేస్తున్న రైతుబంధు డబ్బులు పడ్డాయని రైతులు ప్రభావితం కావొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రధాని



ఎ ా ా దీ జేసీబీ, క్రేన్ పెట్టి లేపినా బీఆర్ఎస్ లేవదన్నారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రజల ఓట్లు కో కేసీఆర్ భావిస్తున్నారన్నారు. పదేళ్ల పాటు సీఎం కేసీఆర్, ప్రధాని మోదీ పంచుకొని ఆస్తులు పంచుకున్నారన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకే బండి సంజయ్‌ని తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేశారన్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఇంకా ఇందిరమ్మ ఇంట్లోనే ఉంటున్నాడని రేవంత్ విమర్శిస్తున్నాడన్నారు. కాంగ్రెస్‌కి పడే ఓట్లను చీల్చడానికి బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహం రచిస్తున్నాయని కేసీఆర్ పేర్కొన్నారు.కేసీఆర్ పై బీజేపీ చర్యలు తీసుకోకపోవడం వల్లే పలువురు నాయకులు కాంగ్రెస్ లో చేరారని.. అయితే వారంతా బీజేపీలో ఉంటే మంచివారు లేదంటే రావణాసురులు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్న బీజేపీ 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజాదర్బార్ పెడతాడో, జనతా బార్ పెడతాడో వాళ్ళకే తెలియాలన్నారు. వైన్ షాపులు, బెల్ట్ షాపులు పెట్టి ఉద్యోగాలు ఇచ్చామని చెప్తున్న ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ ఓటుకు పదివేలు పంచే ప్రయత్నం చేస్తున్నారు. రైతుబంధుకు అనుమతి తెచ్చుకున్న వాళ్ళు దళితబందు, బీసీ బందు, మైనారిటీ బందుకి అనుమతి ఎందుకు తెచ్చుకోలేదు? .

మిగతా 2లో

### అమిత్ షా కాదు..

# అబద్ధాల బాద్ షా

(మొదటిపేజీ తరువాయి)
బీజేపీ మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అని, కోర్టుల్లో కేసులు వేసి అనేక ఇబ్బందులు పెట్టారని విమర్శించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా కోరుట్ల టౌన్‌లో నిర్వహించిన రోడ్ షోలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి కవిత ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఢిల్లీ నుంచి ప్రధాని మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వంటి వాళ్లు బయటి వచ్చి కుటుంబ పాలన గురించి మాట్లాడుతున్నారని కాని తమది నలుగురితో కూడిన కుటుంబం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలతో కూడిన కుటుంబమని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసింది

(మొదటిపేజీ తరువాయి)
ఏ మాత్రం అవగాహన లేకపోవడం నిజంగా దురదృష్ట కరమని అన్నారు.ఆయన మనందరం అభిమానించే వ్యక్తి అని, భూమి పుత్రుడని, తన జీవితం అంతా కాంగ్రెస్ పార్టీ కోసం సేవ చేసిన అలాంటి మానవతామూర్తిని కాంగ్రెస్ పార్టీ దారుణంగా అవమానించిందని మంత్రి చెప్పారు. 1996లో సిట్టింగ్ ప్రధానిగా ఉన్న పీవీ నర్సింహారావుకు ఎంపీ టికెట్ నిరాకరించి.. కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని మంత్రి తెలిపారు. పీవీ మరణించినప్పుడు కనీసం 24 అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలోకి కూడా ఆయన భౌతిక కాయాన్ని అనుమతించకుండా అవమానించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఈ చరిత్ర గురించి ప్రియాంకాగాంధీకి అవగాహన లేకపోవడం దారుణమని అన్నారు. పీవీ కుటుంబానికి రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### తేజస్' యుద్ధ విమానంలో

## ప్రయాణించిన ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)
కంటే తక్కువ కాబోమని నేను గర్వంగా చెప్పగలను. భారత వాయుసేన, డీఆర్‌డీవో, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు హృదయపూర్వక అభినందనలు" అని మోదీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తయారీ యూనిట్‌ను ప్రధాని పరిశీలించారు.

### రెస్క్యూ ఆపరేషన్‌కు

## మళ్లీ అడ్డంకి

(మొదటిపేజీ తరువాయి)
ఆపరేషన్ కోసం వచ్చిన సంస్థల ప్రతినిధులంతా ఇప్పటికే దీనిపై చర్చించారు. వర్టికల్ డ్రిల్లింగ్‌కి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ డ్రిల్లింగ్‌కి కోసం వినియోగించే మెషీన్ ఇన్‌స్టాలేషన్ పూర్తైంది. సిబ్బంది వర్టికల్ డ్రిల్లింగ్ సైట్‌కి చేరుకునేందుకు రోడ్డు మార్గం వేస్తోంది. ఆ తరవాత పైకి మెషినరీని పంపించి పై నుంచి వర్టికల్ డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. ఈ డ్రిల్లింగ్ కోసం కనీసం 20 మంది సిబ్బంది పని చేయనున్నారు. ఈ డ్రిల్లింగ్‌కి సరిపోతుందనుకున్నప్పటికీ దీని వల్లే ఇప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపు 14 రోజులుగా వాళ్లు సొరంగం లోపలే చిక్కుకున్నారు. కేవలం భారీ మెషీన్‌లపైనే ఆధారపడకుండా మిగతా టూల్స్‌నీ వినియోగిస్తోంది రెస్క్యూ ఆపరేషన్ సిబ్బంది. సుత్తి, గ్యాస్ కట్టర్‌తో పాటు మరి కొన్ని కామన్ టూల్స్ వాడుతున్నారు. ఇప్పటికే జొప్పించిన పైప్‌లో ఏమైనా అడ్డంకి వస్తే ఈ టూల్స్‌తోనే వాటిని తొలగించనున్నారు. కాకపోతే ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. కానీ ఇప్పటికి మరో ఆప్షన్ కనిపించడం లేదు.

## ఎవరు ఏం చేసినా కేసీఆర్ గెలవడు

(మొదటిపేజీ తరువాయి)
ఎన్నికల్లో మా పోటీ ఈడీ, ఐటీ తోనే ఉంది. కాంగ్రెస్ నేతలపై ఈడీ దాడులు, గోయల్ ఇంటిపై దాడి, రైతుబంధు విషయంలో మోదీ, కేసీఆర్ స్నేహం స్పష్టంగా అర్థం అవుతోందని రేవంత్ విమర్శించారు. వివేక్ బీజేపీలో ఉన్నప్పుడు ఎలాంటి చర్యలు లేవు. బీజేపీలో ఉన్నప్పుడు రాముడిగా కనిపించిన వివేక్.. కాంగ్రెస్‌లోకి రాగానే రావణసూరుడిగా మారాడు. కేసీఆర్‌ని గద్దె దించేందుకు కంకణం కట్టుకున్నాడు కాబట్టే పొంగులేటిపై దాడులతో హింసిస్తున్నారని మండిపడ్డారు.

## ఓట్ల కోసమే.. కాంగ్రెస్ రాజకీయం

హుస్నాబాద్ - ప్రభాత సూర్యుడు: మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు పేరును ఉచ్చరించే నైతిక హక్కు, అర్హత కాంగ్రెస్ పార్టీకి, ప్రియాంక గాంధీకి లేవని, కేవలం ఓట్లకోసం పివి పేరును కాంగ్రెస్ పార్టీ వాడుకుంటోందని మాజీ ఎంపీ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు ధ్వజమెత్తారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కెప్టెన్ మాట్లాడారు. హుస్నాబాద్ లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ స్వర్గీయ పివి నరసింహారావు పేరుతో ఓట్లు అడగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాడు మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు పివి నడిపారని, నాడు దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉండేదని, బంగారాన్ని తాకట్టు పెట్టిన దుస్థితి ఉందని, కానీ ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించారని అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలతో ప్రపంచమే గర్వించదగ్గ నేతగా అపార చాణక్యుడిగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు, సాహితీవేత్త, తెలుగు ప్రజల గుండెచప్పుడు, తెలంగాణ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు ఐన పివి ప్రధాని పీఠం నుండి 1996 లో దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. పివి మృతి చెందితే కనీసం పట్టించుకోలేదని, అయన అంత్య క్రియల కార్యక్రమాన్ని కూడా సరిగ్గ నిర్వహించకపోతే.. ప్రజలు ఎంతో బాధ పడ్డారని అన్నారు.

# బీఆర్ఎస్ పాలనా అంతా మోసం

(మొదటిపేజీ తరువాయి)
జరిగాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. బీఆర్ఎస్ ను మళ్లీ గెలిపిస్తే ప్రజల సొమ్ము దోచుకుంటారని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పారు. వరికి క్వింటాల్ కు రూ.3,100 చెల్లిస్తామని, పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గిస్తామని పేర్కొన్నారు. ఆడపిల్లల పేరు మీద రూ.2 లక్షలు ఫిక్స్ డ్ డిపాజిట్ చేస్తామని స్పష్టం చేశారు. పదేళ్లలో తెలంగాణకు రూ.2.50 లక్షల కోట్లు ఇచ్చినట్లు వివరించారు. యువత, దళితులు, వెనుకబడిన వర్గాలు చాలా అసంతృప్తితో ఉన్నారని, ఈసారి తెలంగాణ ప్రజలు బీజేపీకి అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యోగాల పేరుతో మోసం చేశారని, లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని గొప్పగా చెప్పి పూర్తి చేయలేదని అమిత్ షా మండిపడ్డారు. 'నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇవ్వలేదు. ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ చేసి కుంభకోణానికి పాల్పడ్డారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఇప్పటివరకూ పూర్తి చేయలేదు. 4 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం కలగానే మిగిలింది. తెలంగాణ విమోచన దినోత్సవం కూడా నిర్వహించడం లేదు. ఎంఐఎంకు భయపడి ముస్లిం రిజర్వేషన్లు కల్పించారు.' అని విమర్శించారు. డబుల్ బెడ్రూం, దళిత బంధు పథకాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. రూ.వేల కోట్లు ఖర్చు చేసినా మిషన్ కాకతీయ పనులు పూర్తి కాలేదని మండిపడ్డారు.తెలంగాణలో గత పదేళ్లుగా కుటుంబ పాలనే నడిచిందని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ మూడూ కుటుంబ పార్టీలేనని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వీరి జెండాలు వేరైనా అజెండా ఒకటేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే, వారు వెళ్లి బీఆర్ఎస్ లో కలుస్తారని పేర్కొన్నారు. సుదీర్ఘ పోరాటాలు చేసి, 1200 మంది యువత బలిదానాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ఈ ఎన్నికలు తెలంగాణకు అత్యంత కీలకమైనవని, మీ ఓటు తెలంగాణ, దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల కలలు సాకారం చేసే బాధ్యత తాము తీసుకుంటామని, బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని పునరుద్ఘాటించారు.

### నరేంద్రమోడీ నల్లచట్టాలు చేసి

## రైతులను మోసం చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)
బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోడీ నల్లచట్టాలు చేసి రైతులను మోసం చేస్తున్నారన్నారు. "నా పార్లమెంటు సభ్యత్వం రద్దు చేశారు.. నాకు ప్రభుత్వ ఇంటిని తొలగించారు" అని అన్నారు. రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందని తెలిపారు. కాళేశ్వరం పేరుతో పెద్ద కుంభకోణం చేశారని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌తో ఎమ్మెల్యేకు భూములు అప్పగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు.రాహుల్ ఇంకా మాట్లాడుతూ... దొరలకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. పేదల కోసం కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. మళ్ళీ అధకారంలోకి వేస్తే భూములు గుంజుకుంటారని విమర్శించారు. కేసీఆర్ చదువుకున్న పాఠశాల కాంగ్రెస్ పార్టీ కట్టిందే అని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ఐటీ సిటీ చేసింది కాంగ్రెస్ అని.. మెట్రో కాంగ్రెస్ హయంలోనే వచ్చిందని చెప్పుకొచ్చారు.

కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు దోపిడీదారులన్నారు. లిక్కర్ మాఫియా, భూదందా కేసీఆర్ కుటుంబంలో ఉందని దుయ్యబట్టారు. దళితబంధు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ దారి మళ్లించారని ఆరోపించారు.వచ్చేది ప్రజల ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మొదటి క్యాబినెట్ మీటింగ్‌లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ఏ బిల్లు పెట్టినా కేసీఆర్ మద్దతు ఇచ్చారన్నారు. మూడు బిల్లులను తాను కళ్ళారా చూసినట్లు తెలిపారు. తెలంగణ తన సొంత ఇల్లు అని పేర్కొన్నారు. కేసీఆర్ మీద ఒక్క కేసు పెట్టలేదని.. కేసీఆర్‌కు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు.

కేసీఆర్, బీజేపీని తరిమికొట్టాలని.. కేంద్రంలో బీజేపీని, మోడీని ఓడించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తెలంగాణలో, మోడీ ఢిల్లీలో రాజ్యమేలుతున్నారని అన్నారు. కారు టైరులు కాంగ్రెస్ పంచర్ చేసిందని.. బీఆర్ఎస్ గాలి తీశారని.. ఢిల్లీకి వెళ్లి మోడీని పంచరు చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల తెలంగాణ తెచ్చుకుందామని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

# సంగారెడ్డిలో 635 కిలోల గంజాయి స్వాధీనం


సంగారెడ్డి- ప్రభాత సూర్యుడు: సంగారెడ్డిలో 635 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. రూరల్ పోలీస్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.3 కోట్ల వరకు ఉండొచ్చని ఆయన చెప్పారు. రెండు బొలెరో వాహానాలను సీజ్ చేసి.. ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు మీడియాకు వివరించారు. బొలెరో వాహనాల కింది భాగంలో బాక్సు లాంటి నిర్మాణం ఏర్పాటు చేసి గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన తమ యజమాల ఆదేశాలతో ఒడిశాలోని జన్ భాయ్ ఏజెన్సీ ప్రాంతంలో ఉండే త్రినాథ్ అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు రవాణా చేస్తున్నట్టు వారు తెలిపారు. టాస్క్ ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు వాహానాల తనిఖీ నిర్వహించి గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగుచేస్తున్నట్టుగానీ, రవాణా చేస్తున్నట్టు గానీ తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. యువకులు గంజాయికి బానిసై తమ విలువైన భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని, కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారని అన్నారు. ఈ తరహా వ్యక్తులు డబ్బుల కోసం నేరాలు చేసేందుకు కూడా వెనకాడబోరని అన్నారు. అలా జరగకుండా ఉండాలంటే అందరూ కలిసి గంజాయి అనే మహమ్మారిని అంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు నవంబర్ 30 జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే టాస్క్ ఫోర్స్ బృందాలు, సంగారెడ్డి రూరల్ సిబ్బంది కలిసి సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, కానిస్టేబుళ్లు ఇస్మాయిల్, శంకర్ తదితరులను ఎస్పీ అభినందించారు.

# బీజేపీతోనే తెలంగాణ సౌభాగ్యం

(మొదటిపేజీ తరువాయి)
కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు డబ్బులు అవసరం పడితే ఏటీఎం దగ్గరికి వెళ్తారని, బీఆర్ఎస్ నాయకులు మాత్రం.. ప్రాజెక్టులకు కొత్త ప్రాజెక్టులు నమోదు చేసి వారి జేబులు నింపుకుంటారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతుల నుంచి బాయిల్డ్ రైస్ తీసుకుంటామనీ, ఈ ఖరీఫ్‌లో అదనంగా 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. చెరకు రైతులకు లాభం కలిగేలా పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్నట్టు తెలిపారు. ఇథనాల్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని, దాంతో కామారెడ్డి రైతులకు లాభం జరుగుతుందని అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగిన సభలో ఆయన మాట్లా డుతూ.. కాంగ్రెస్ నేతల గర్వాన్ని, అహంకారాన్ని అణచాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ కార్బన్ పేపర్‌గా మారుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్ కు వేసినట్టే.. అని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామన్నారు. సుప్రీంకోర్టులో మాదిగ సామాజిక తరగతి తరపున న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణలో బీజేపీ పాలనపై నమ్మకం పెరుగు తోందన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా బీజేపీకే ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి లోకేష్, భువనేశ్వరి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర మళ్ళీ మొదలు కాబోతుంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ అవ్వడంతో పాదయాత్రను నిలిపివేసిన లోకేశ్ తిరిగి నవంబర్ 27న ప్రారంభించనున్నారు. ఈ మేరకు టీడీపీ పార్టీ రూట్ మ్యాప్ విడుదల చేసింది. యువగళం యాత్ర ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు మండలం పొదలాడ నుంచి ప్రారంభం కానుంది. చంద్రబాబును అరెస్టు రోజే లోకేశ్ తన యాత్రను పొదలాడలో నిలిపివేశారు. దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి పాదయాత్ర ప్రారంభించనున్నారు. తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో లోకేశ్ పాదయాత్ర ముగియనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లోని మూడు జిల్లాల్ని కలిపేలా పాదయాత్ర రూట్ మ్యాప్ ఖరారు చేశారు. ఇప్పటి వరకు నారా లోకేశ్ 208 రోజులపాటు..2,852 కిలోమీటర్లకు పైగా నడిచారు. అంతేకాదు 84 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ పాదయాత్ర కొనసాగింది. 400 రోజుల్లో 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయాలని లోకేశ్ భావించారు. ఈ పాదయాత్రను శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు



చేయాలని భావించారు. అయితే రెండున్నర నెలలపాటు అంతరాయం ఏర్పడటంతో ఈ పాదయాత్ర విశాఖ పట్నంలోనే ముగించాలని లోకేశ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయానికి ఎన్నికలు కూడా సమీపిస్తాయి కాబట్టి ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటంతో విశాఖతో ఫుల్ స్టాప్ పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పాదయాత్ర ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని, అదే రోజు సాయంత్రం తాటిపాకలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు చెప్పా రు. లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతం చేసేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకవైపు, లోకేశ్ మరో వైపు పాదయాత్రలు చేసి టీడీపీ, జనసేన నాయకుల మధ్య సమన్వయం పెంచి ప్రభుత్వంపై పోరాడుతున్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్థాపానికి గురై మరణించిన వారి కుటుంబాలను పరామర్శించడానికి నిజం గెలవాలి అన్న పేరుతో ఆమె ఒక యాత్రను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ యాత్ర చేపట్టిన కొద్ది రోజులకే జైలు నుంచి చంద్రబాబు విడుదల కావడంతో మరో జిల్లా పర్యటన ఖరారు కాలేదు. ?ప్పుడు ఆమె పర్యటనలపై కూడా రూట్ మ్యాప్ ఖరారు అవుతోంది. వారానికి మూడు రోజులపాటు ఆమె పర్యటనలు ఉండేలా కార్యక్రమం తయారవుతోంది. లోకేశ్ గోదావరి జిల్లాల్లో పర్యటిస్తున్నందువల్ల ఆ రాయలసీమ, ఇతర కోస్తాజిల్లాల్లో ముందుగా ఆమె పర్యటనలు ఉండేలా చూడాలని నిర్ణయించారు.

## సంపాదకీయం

# న్యాయ వ్యవస్థపై పని ఒత్తిడి

భారతదేశ రాజ్యాంగం అన్ని చట్టాలకు మూలాధారం. ఇదే రాజకీయ వ్యవస్థకు మౌలిక లక్షణాలను కట్టబెట్టింది. రాజ్యాంగంలో పొందుపరచిన ఎటువంటి చట్టం అయిన దేశంలో నివసించే ప్రతి పౌరునికి, ప్రతి ప్రాంతానికి వర్తిస్తుంది. ప్రభుత్వ అంగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సిందే. రాజ్యాంగానికి సార్వభౌమాధికారం ప్రజలచే ఏర్పడింది. కావున న్యాయవ్యవస్థతో సహ, శాసన, కార్యనిర్వాహక శాఖలు ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిందే. ఈ మూడు భాగాలలో ఏ ఒక్కటి రాజ్యాంగం కంటే ఎక్కువ కాదు. దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా రాజ్యాంగ చట్టాలకు లోబడే ఉంటుంది. రాజ్యాంగ అధికారాలు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు ఆపాదించటమైంది.కొన్ని రోజుల క్రితం ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రజాప్రతినిధులపై పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సుప్రీంకోర్టు చొరవ తీసుకోవడం ఆహ్వానించదగిన విషయం. నేర చరిత కలిగిన నేతలపై పెండింగ్ కేసులు ప్రజాస్వామ్యానికి దెబ్బ అని రాష్ట్ర హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. అన్ని రాష్ట్రాలలో ప్రజాప్రతినిధులపై పెండింగ్ కేసులు ఉన్నవి.. ఇవి ఇంకెన్నాళ్ళు జాప్యమవుతాయి. నేరచరిత కలిగిన వాళ్ళు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేలా చేయడంలో చొరవ తీసుకోవడం చాలా అవసరం. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా పిలవబడే భారతదేశంలో ఎన్నికల కోలాహలం ప్రారంభమయ్యింది. 2024 లోక్ సభ ఎన్నికలకు ముందుగా జరుగుతున్న ఈ ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంలో ప్రజాప్రతినిధులపై పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సుప్రీంకోర్టు చొరవ తీసుకోవడం మంచి పరిణామం.శాసన శాఖ చేసే చట్టాలు ప్రజలకు న్యాయం కల్పించలేని పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ తలుపులు తెరచుకుంటాయి. సాధరణంగా శాసన శాఖ చట్టాలను రూపొందిస్తే కార్యనిర్వాహక శాఖ వాటిని అమలు చేయాలి. ఆ చట్టాలు రాజ్యాంగానికి లోబడి ఉన్నాయో లేదో అని పరిశీలించేదే న్యాయశాఖ. మరీ అటువంటి చట్టాలతో న్యాయం జరగనప్పుడు న్యాయవ్యవస్థను ఆశ్రయించటం నేడు పరిపాటిగా మారింది. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్) పుణ్యమా అని న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువయ్యింది. ఆధునిక ప్రజాస్వామ్య తరహా ప్రభుత్వ లక్షణాల్లో 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ' చాలా ముఖ్యమైనది.భారతదేశ రాజ్యాంగ పౌర చట్టాల పరిరక్షణలో న్యాయవ్యవస్థ క్రియాశీల పాత్ర వహిస్తుంది. అయితే ఇవి ఇచ్చే తీర్పులని బట్టి ప్రభుత్వంలోని నాయకులు న్యాయవ్యవస్థ తన పరిధిని దాటిందని విమర్శిస్తే, మరికొందరు న్యాయవ్యవస్థను 'ప్రజాస్వామ్య సంరక్షకుడి'గా గుర్తించారు. ఇలా అన్ని విషయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న న్యాయవ్యవస్థ పెండింగ్ కేసులతో పని ఒత్తిడి బాగా పెరిగింది. దీనికోసం సుప్రీంకోర్టులో గరిష్ట న్యాయమూర్తుల నియామకం చేయడం శుభ పరిణామం.రాజ్యాంగ మరియు చట్టాల పరిరక్షణతో పాటు మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా సమన్యాయం కలిపించడానికి న్యాయవ్యవస్థకు 'సృజనాత్మకత', 'పూర్తి స్వతంత్రత' చాలా అవసరం. నిరంతరం శాసన శాఖ, కార్యనిర్వాహక శాఖల వైఫల్యం, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయ పరిరక్షణ చేకూర్చేందుకు న్యాయవ్యవస్థ తనకు తాను పరిస్థితులకు అనుగుణంగా తీర్పులను ఇచ్చే ఆవశ్యకతను తెలియజేస్తుంది. దేశంలో లోక్‌పాల్, లోక్ అదాలత్, ట్రిబ్యునళ్ళు వంటి వ్యవస్థలను పూర్తిస్తాయిలో ఏర్పాటు చేసి పరిపాలన నాణ్యతలో న్యాయం చేకూరేలా కృషి చేయటంలో న్యాయ వ్యవస్థ తీరు ఇంకా మెరుగుపడుతుంది.రాజ్యాంగంలో 'న్యాయసమీక్ష' ప్రక్రియలో భాగంగా న్యాయవ్యవస్థ పరిమిత అధికారాలను మాత్రమే కలిగి ఉంది. అలా న్యాయ వ్యవస్థ దాని పరిధిలోనే ఉంటూ పూర్తి న్యాయం అందించాల్సి ఉంది. అంతేకాని ఈ పరిమిత అధికారాలను ఆసరాగా తీసుకొని పూర్తిగా రాజ్యాంగ సవరణ చేసే అధికారాలను విస్తృతపరచుకోజాలదు. అధికరణ 32, 141, 142 ప్రకారం న్యాయ వ్యవస్థ రాజ్యాంగాన్ని సమీక్షించే అధికారాన్ని విస్తరించుకోజాలదు. కాని శాసన, కార్యనిర్వాహక శాఖల వైఫల్యంతో న్యాయవ్యవస్థపై పని భారం పెరిగింది. ప్రభుత్వ పాలసీ విధానాలపై కూడా న్యాయ వ్యవస్థ తీర్పులను ఇచ్చే అవకాశం ఏర్పడింది. చివరగా న్యాయవ్యవస్థలో కూడా కొన్ని లోటుపాట్లు, విమర్శలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో తన పరిధిని అతిక్రమించకుండా 'రాజ్యాంగ పరిరక్షణ' పాత్రను సమర్థవంతంగా పోషించటం వలన న్యాయవ్యవస్థపై రోజు రోజు ప్రజా విశ్వాసం పెరుగుతుందని చెప్పవచ్చు. న్యాయవ్యవస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా సత్వర పరిష్కార తీర్పులను ఆశించటం భావ్యం కాదని ప్రభుత్వం గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



**ఆర్మూర్ - ప్రభాత సూర్యుడు :** రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజక వర్గంలోని ఆర్మూర్, గోవింద్ పెట్, అంకాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలని మోసం చేశాడని అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. కమిషన్లకుసంబంధించిన పనులను చేశాడని, ఎమ్మెల్యే వెనుకాల ఉన్న చోటామోటా నాయకులు దౌర్జన్యంగా కబ్జాలు చేశారని అన్నారు. ఎవరైనా ఎదిరిస్తే కేసులు పెట్టి నానా హింసలు చేశారని అన్నారు. నేను మీకు ఉన్నానని నేను పక్కాలోకల్ అని అన్నివేళలా మీకు అండగా ఉంటానని వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ నుంచి తరిమి కొట్టాలని ప్రజలు నిర్ణయించారని అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గంలో బిఆర్ఎస్ పార్టీని ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని చిత్తుగా ఓడించాలని ప్రతి గ్రామ గ్రామంలో ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు.


# కాంగ్రెస్ కావాలా.. కరెంట్ కావాలా?

## మంత్రి హరీష్ రావు



**మహబూబాబాద్- ప్రభాత సూర్యుడు:** మహబూబాబాద్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ నాయక్కి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో త్రి హరీశ్ రావు పాల్గొన్నారు. మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల మీటింగులు చూస్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నయి. బీఆర్ఎస్ మీటింగ్ అంటే జన సముద్రంలా ఉన్నయని అన్నారు. సమైక్య వాదులు దండయాత్రకు వచ్చిన రోజు మానుకోట ప్రజలు తరిమికొట్టారు. మానుకోటకు మట్టికి దండం మానుకోట రాళ్లకు దండం. మానుకోట దెబ్బతో సమైక్య వాదులు వెనుకకు పరిగెత్తారు. మళ్లీ సమైక్యవాదులు ఒక్కటై తెలంగాణ మీద దండెత్తడానికి వస్తుండ్రు. వారికి మన మానుకోట దమ్మేంటో చూపించాలని అన్నారు. కార్యకర్తలు మంచిగా పని చేసి శంకర్ నాయక్ ని మూడోసారి గెలిపించాలి. మానుకోట రోడ్లు సిద్ధిపేట కంటే బాగున్నాయి. గులాబీ జెండా లేకుంటే మానుకోట జిల్లా అయ్యేదా? మెడికల్ కాలేజ్ వచ్చేదా? హార్టికల్చర్ కాలేజ్ వచ్చేదా? తండాలు గ్రామ పంచాయితీలు అయ్యేవా? పోడు భూములకు పట్టాలు వచ్చేవా? రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కర్ణాటకలో ప్రచారం చేసి 5 గ్యారంటీలు అని ఊదరగొట్టి మోసం చేసిండ్రు. రేవంత్ రెడ్డికి ఏ విషయం మీద పూర్తి అవగాహన ఉండదు. కాళేశ్వరం ప్రాజెక్టు రేవంత్ రెడ్డి నెత్తిమీద కట్టాల్నా? బూతులు మాట్లాడే నాయకులు కావాలా? భవిష్యత్తు అందించే నాయకుడు కావాలా? నాడు కాల్వల్లో తుమ్మచెట్లు మొలిచినయి. నేడు రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు వస్తున్నయి. బోరింగులు మాయమైపోయినయి. ఇంటింటికీ నల్లా నీళ్లు వస్తున్నయి. నాడు దొంగ కరెంటు కోసం బాయి కాడ పండుకున్న రోజులు మర్చిపోయిండ్రా? ఉచిత కరెంటు అని చెప్పి ఉత్త కరెంట్ చేసింది కాంగ్రెస్. కాంగ్రెస్ కావాలా? కరెంట్ కావాలా? కరెంట్ కావాలంటే కారుకు ఓటు గుద్దు. రిస్క్ వద్దు కారుకు గుద్దు. రైతు బంధు విషయంలో కాంగ్రెస్ కుట్ర చేసింది. కేసీఆర్ చేసిన కృషి వల్ల రైతు బంధు డబ్బులు సోమవారం రోజు ఖాతాల్లో పడతాయి. రైతులను బిచ్చగాళ్లు అన్న రేవంత్ రెడ్డికి రైతులే గుణపాఠం చెప్తరు. కాంగ్రెస్ మోసం చేసే పార్టీ. కేసీఆర్ అంటే మాట తప్పనోడు. ఇప్పటివరకు 90 శాతం హామీలను నెరవేర్చాం. రుణమాఫీ కూడా త్వరలో పూర్తి చేస్తాం. ఈ దఫా ఇళ్లు కట్టడంపై దృష్టి సారిస్తాం. మూడోసారి గెలిస్తే అసైన్డ్ భూములను పట్టా భూములుగా గుర్తిస్తాం. ఆసరా పెన్షన్లు 2 వేల నుంచి 5 వరకు పెంచుతాం. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తాం. మహిళలకు 400కే గ్యాస్ సిలిండర్, ప్రతీ నెలా 3 రూపాయలు ఇస్తాం. శంకర్ నాయక్ మాట కరుకు కానీ మనసు మంచిది. సిద్ధిపేటకు నేను తేలేని కాలేజీలను శంకర్ నాయక్ మహబూబాబాద్ కి తెచ్చుకున్నడు. నా వల్లే కాని పనిని శంకర్ నాయక్ చేసి చూపించిండు. లంబాడీలకు అత్యధిక ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చింది కేసీఆరే. ఎస్సీ, ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆర్. మీ ఆఖరి డిమాండ్ అయిన గిరిజన బంధును ఈ సారి పక్కాగా అమలు చేస్తామని అన్నారు.

# ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం



**ఆమనగల్-- ప్రభాత సూర్యుడు:** సీఎం కేసీఆర్ అవినీతి, అక్రమాలతో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో కల్వకుర్తి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రాజెక్టుల ముసుగులో రూ.5.70 వేల కోట్ల అప్పులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, దాంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి నెత్తిపై రూ.1.50 లక్షల అప్పు ఉందని తెలిపారు. నిరుపేద కుటుంబాల రైతులకు 70 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత పాలనతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేద, మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు ఒక్కటేనన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. భూ, ఇసుక, మైనింగ్ మాఫియాలతో చేతులు కలిపి అక్రమంగా లక్షల కోట్లు సంపాదిస్తూ అప్పుడప్పుడు ఒక కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను మభ్య పెడ్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నాయకులకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండే కల్వకుర్తి శాసన సభ్యునిగా కసిరెడ్డి నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రైతుబంధుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్న కేసీఆర్ దళిత బంధు పథకం కొనసాగింపునకు ఎందుకు అనుమతి తీసుకోలేదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దళితున్ని సీఎం చేస్తామని చెప్పిన కేసీఆర్.. పదేండ్లుగా వారిని మోసం చేస్తూనే ఉన్నారన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన కుటుంబ పాలనను అంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

# రాష్ట్రంలో కుటుంబ పాలన

## -బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా



**హుజూర్ నగర్ - ప్రభాత సూర్యుడు :** సకల జనులు ఏకమై సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.. కుటుంబ పాలనలో బంధి అయిందని బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా అన్నారు శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు. మత ప్రాతిపదికన నాలుగు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణమని తెలిపారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్ డబ్బులు విత్ డ్రా చేసుకునే మిషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేలకోట్ల నిధులతో అంచనా వేసిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం రూ.1.30 లక్షల కోట్లకు పెంచి కేసీఆర్ ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. దళిత బంధులో 30శాతం ఎమ్మెల్యేలు లంచాలుగా తీసుకున్నారని సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు యువతకు ఉపాధి, రైతులకు భరోసా బీజేపీ ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. హుజూర్ నగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ సిండికేట్ రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు . కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజు చంద్రశేఖర్, కర్నాటక ఎమ్మెల్సీ రవికుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి కిషోర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బొబ్బ భాగ్యరెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్ రెడ్డి, కిషోర్ రేలంగి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అడవిపై అవగాహన అవసరం

### హైదరాబాద్ విద్యార్థులు అడవిలో విహారయాత్ర




**తాడ్వాయి - ప్రభాత సూర్యుడు :** విద్యార్థి దశ నుంచే మొక్కలను పెంచడం, పెంచిన మొక్కలను కాపాడడం, అడవులను సంరక్షించడం అని విషయాలపై అవగాహన అవసరమని తాడ్వాయి వన్యప్రాణి విభాగం అటవీ శాఖ అధికారి చౌకత్ అలీ అన్నారు. శనివారం శ్లోక ద వరల్డోరఫ్ హైదరాబాద్ పాఠశాల విద్యార్థుల తోటి ములుగు జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ఆదేశాల మేరకు వనదర్శిని ప్రోగ్రాం ద్వారా అడవిలో విహారయాత్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీలు అందరికీ అటవీ యొక్క ప్రయోజనాలు, పర్యావరణం పరిరక్షణ, అడవులు తరుగుదల వలన కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ చౌకత్ అలీ మాట్లాడుతూ అడవుల వలన వర్షపాతం ఎలా ఉంటుందో వివరించారు. విద్యార్థులకు వివిధ మొక్కలను చూపించి అవగాహన కల్పించారు. ఏటూరు నాగారం వన్యప్రాణుల అభయారణ్యం పై ఓ డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించారు. వన్యప్రాణులకు అటవీశాఖ అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు ఉమారాణి, రమాదేవి 8 మంది ఉపాధ్యాయులు, 40 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యమే

**- ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి ప్రధాని మోదీ**
**- బీసీ ముఖ్యమంత్రి ఉన్నప్పుడే రిజర్వేషన్ దక్కుతుంది**
**- బీజేపీ అధికారంలోకి వచ్చాక జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధతా**
**- జాతీయ బీసీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ లోకేశ్‌కుమార్ ప్రజాపతి**

మెదక్ – ప్రభాత సూర్యుడు :

బీసీలు ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని జాతీయ బీసీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ లోకేశ్‌కుమార్ ప్రజాపతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మాయ గార్డెన్‌లో బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్రంలో 60 శాతం పైగా బీసీ జనాభా ఉన్నా రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గాలను పూర్తిగా విస్మరించాయని చెప్పారు. బీసీ ముఖ్యమంత్రి ఉన్నప్పుడే రిజర్వేషన్ దక్కుతుందన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధత కల్పించలేదని,.. బీజేపీ అధికారంలోకి వచ్చాక జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ కు రాజ్యాంగ బద్ధతా కల్పించిందన్నారు. దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ మాట తప్పారని, దీనిపై బీసీ సమాజం ఆలోచించాలన్నారు. బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పిస్తే బీసీలు అభివృద్ధి చెందుతారని చెప్పారు. తెలంగాణలో గడీల పాలన నడుస్తోందని, ఏ ఆశయాల కోసం తెలంగాణ సాధించుకున్నామో అవి నెరవేరలేదన్నారు. సీఎం స్థానం బీజేపీ బీసీలకు ఇవ్వడం బీసీ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు, హర్యానా మేయర్ మధన్ చౌహాన్, బీసీ సంఘాల మహిళ రాష్ట్ర నాయకురాలు ఆకుల విజయ,నాగ పరిమిల, వివిధ బీసీ కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు బెండ వీణా, మంజుల, మాయ శంకర్, రమేష్ గౌడ్, బండ నరేందర్, గొల్ల పవన్ కుమార్, రవీందర్ చారి, శ్రీనివాస్ చారి, బైండ్ల సత్యనారాయణ,విప్లవ్ కుమార్, సుభాష్ గౌడ్, వినయ్ జైస్వాల్, జ్వాల సాయిబాబా, ప్రసాద్ యాదవ్, నర్సింలు, సోమ కృష్ణ, నంగి పవన్ తోపాటు వేలాది బీసీలు పాల్గొన్నారు.

## తొమ్మిదేండ్లలో మేం గిన్ని చేస్తే కాంగ్రెస్సోళ్లు ఎన్ని చేయాల

**- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని – ప్రభాత సూర్యుడు:

మీ ఇంటి బిడ్డగా నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అనేక మంచి పనులే చేశానని, ఎంతో మందికి సాయం అందించానని అయినా కాంగ్రెస్సోళ్లు తనను చెడ్డోనిగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ వాపోయారు.అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోబాగంగా శనివారం మంథని మండలం ఖానాపూర్ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎమ్మెల్యేగా, ఈనాడుజెడ్పీ చైర్మన్‌గా ఖానాపూర్ గ్రామానికి అనేక అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. మంథని నుంచి ఎల్‌మడుగు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో ఇప్పటికే బండ్ల మడుగు దాకా రోడ్డు వేశామన్నారు. అలాగే నల్లవాగుపై కల్వర్టు నిర్మించి రైతుల కష్టాలు తీర్చామన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులే కాకుండా ఎంతో మంది పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు, విద్యార్థుల చదువులు, ఆస్పత్రులకు సాయం, మధ్యాహ్న బోజనాలు పెట్టి విద్యార్థుల ఆకలి తీర్చామని ఆయన తెలిపారు. అనేక సేవలు, అభివృద్ధి పనులు మీ కళ్ల ముందే కన్పిస్తుంటే కాంగ్రెస్సోళ్లు మాత్రం వంద అంబండాలు వేస్తున్నారని అన్నారు. రామగిరి మండలానికి చెందిన ఓ బీద బిడ్డను ప్రజాప్రతినిధిని చేసి అందలం ఎక్కిస్తే ఈనాడు తాను బెదిరింపులకు గురి చేశానని, తనవద్ద రికార్డులు ఉన్నాయంటూ మీడియా ముందు చెప్పిందని, ఈనాటి వరకు ఆ రికార్డులను బయటకు తీసుకురాలేదని అన్నారు. అంతేకాకుండా వంద అంబండాలు వేసినోళ్లు ఒక్కటి కూడా నిరూపించ లేకపోయారన్నారు. తాను మీ కళ్ల ముందే ఎంపీపీగా, జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా, జెడ్పీచైర్మన్‌గా ఎదిగానని, ఇప్పటివరకు ఏ తప్పు చేయకుండా ముందుకు సాగుతున్నానని అన్నారు. ఏ తప్పుచేయకుండా మీకు సేవ చేస్తూ ఎదిగితే రాజకీయంగా అడ్డు వస్తున్నాడని కాంగ్రెస్సోళ్లు తనను ఖతం చేయాలని చూస్తున్నారని అన్నారు. మనోడు ఎమ్మెల్యే అయితే ఎన్ని పనులు అయినవని, కాని వాడిని ఆదరిస్తే ఏం జరుగుతుందని ప్రజలు చర్చించాలన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక పనులు చేశామని, ఎంతో మందికి సాయం అందించామని, అదే కాంగ్రెస్సోళ్లు గొప్పగా ఆలోచనచేసి ఉంటే ఇంకా ఎంత మంచిగా అభివృద్ధి జరిగి ఉండేదని, కానీ వాళ్లు అలా ఆలోచన చేయరని, కేవలం ఓట్లు, సీట్లుమాత్రమే కావాలని ఆయన విమర్శించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఐదేండ్లు ఏం చేయకుండా మళ్లీ ఓట్ల కోసం వస్తున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.ఎమ్మెల్యేగా ఉండి ఎవరైన పని కోసం పోతే మా ప్రభుత్వం లేదని, సాయం చేయమంటే నా దగ్గర డబ్బులు లేవని చెప్పినోళు ఈనాడు ఓట్ల కోసం గడియారాలు, చీరలు, పైసలు ఇస్తున్నారని, మరి ఇప్పుడు పైసలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆలోచన చేయాలన్నారు. కేవలం ఓట్ల కోసం పదవులు, అధికారం కోసం మాత్రమే వాళ్లు ఆరాటపడుతారే తప్ప ప్రజల గురించి కాదనే విషయాన్ని గ్రహించాలన్నారు.ఇప్పటికే కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలు, అభివృద్ధి పనులు చేసిందని, మళ్లీ అధికారంలోకి వస్తే అనేక పథకాలు, పనులు చేస్తామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాంగానే రైతుబంధు పెట్టుబడి సాయం, ఆసరా పించన్‌ల పెంపు, రైతుబీమా తరహాలోనే ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా, గృహిణీలకు సౌభాగ్యలక్ష్మిపేరిట నెలకు మూడు వేలు, రూ.400లకే గ్యాస్ సిలిండర్ఇలా గొప్ప పథకాలు అమలు అవుతాయని, ఈపథకాలతో పాటు తాను సొంతంగా కొన్నిసేవలు అందిస్తామని అన్నారు. నిత్యం మీ బిడ్డల భవిష్యత్ గురించే ఆలోచన చేస్తున్నానని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతిఏటా పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు, హైదరాబాద్‌లో చదువుకునే పేద విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించి రూపాయి ఖర్చు లేకుండా చదివించే బాధ్యత తనదేనన్నారు. అంతేకాకుండా గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరీచేయించి మూడు లక్షలతో పాటుతాను సొంతంగా కొంత సాయం చేసి ఇంటి నిర్మాణాలు చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. పథకాలు, సేవలు ముందుకు సాగాలంటే కేసీఆర్ సర్కార్ రావాలన్నారు. మీ ఇంటి బిడ్డగా ఆదరించి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే పేరు నిలబెట్టుకునేలా అభివృద్ధి, సేవలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.



# అభివృద్ధి చేసా ఆశీర్వదించండి : మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**-కారు జోరుకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు**
**-ప్రతి నిరుపేదలకు 120 గజాల ఇండ్ల స్థలాలు**



ఆదిభట్ల – ప్రభాత సూర్యుడు :

బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించడం జరుగుతుందనీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలీటీలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్‌షో నిర్వ హించడం జరిగింది. రాందాస్‌పల్లి, మల్ శెట్టిగూడ, చింతపల్లిగూడ, మంగళ్‌పల్లి, సాహెబ్ గూడలో జోరుగా సాగిన మంచిరెడ్డి ప్రచార కార్యక్రమం. మంగళ్‌పల్లిలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సంద ర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీలో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు ఆదిబట్ల మున్సిపాలిటీ అంటే ఒక రాష్ట్రమే కాదు, దేశ వ్యాప్తంగా గుర్తింపు దక్కిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. నియోజకవర్గంలో గ్రామ, గ్రామాన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకలు అందుతాయని, కాంగ్రెస్ కు ఓటు వేస్తే మళ్ళీ కరెంట్ కష్టాలు తప్పయన్నారు. ఇక్కడ ఉన్న పార్టీ అభ్యర్ధులు కనీసం పోటి ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. కారు జోరుకు స్వచందంగా ప్రజలు ముందుకు వస్తున్నారని, ఎంకెఆర్ పౌండెషన్ ఉచిత శిక్షణ ద్వార 1068 మంది ప్రభుత్వ ఉద్యోగాలు రావడం జర్గిందని తెలిపారు. ఈ సారి ప్రభుత్వం ఏర్పడితే కొత్త రేషన్ కార్డులతో పాటు ప్రతీ నీరుపేదలకు 120 గజాల ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూంలు మాంజూరు చేస్తామని అన్నారు. మన ప్రాంతంలో పాక్స్ ఖాన్ కాంపినిలో వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగఆవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయసంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నియోజవర్గ ఇంచార్జీ తీగల కృష్ణారెడ్డి, కొప్పు జంగయ్య, దండెం రాంరెడ్డి, ఆయా గ్రామాల ప్రజా, ప్రతినిధుల నాయకులు, కార్యకర్తలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద ప్రజలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

**- మల్ రెడ్డి రంగారెడ్డి, తీన్మార్ మల్లన్న**



తుర్కయంజాల్ – ప్రభాత సూర్యుడు:

నియోజ కవర్గంలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రోడ్ షో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మున్సిపాలిటీ కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి కి మద్దతుగా భారీ కార్నర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. తుర్కయంజాల్ కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, మల్ రెడ్డి రంగారెడ్డి, తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సోనియా గాంధీ (కాంగ్రెస్ పార్టీ) ఇచ్చిన తెలంగాణనీ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే సబ్బండ వర్గాల ప్రజలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి పాలన అంతం కావాలంటే కాంగ్రెస్ పార్టీ, ఇందిరమ్మ రాజ్యం రావాలి. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలతో పెద, మధ్యతరగతి ప్రజల్లో వెలుగులు నిండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు 2500,చొప్పున 500 కు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా 15 వేల రూపాయలు. పల్లెల్లో పట్టణాలలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, 5 లక్షల రూపాయలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డిని అత్యధిక మెజార్టీతో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి, కౌన్సిలర్లు హరిత ధనరాజు గౌడ్, కోశిక ఐలయ్య, మేతరి అనురాధ దర్శన్, టీపీసీసీ సభ్యులు కాకుమానుసునీల్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ కప్పరి స్రవంతి చందు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలి

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**
**-కౌంటింగ్ పై అధికారులకు అందించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

మంథని – ప్రభాత సూర్యుడు:

అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శనివారం రామగిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్, మంథని, పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.ఎన్.శ్రీధర తో కలిసి కౌంటింగ్ నిర్వహణపై అధికారులకు అందించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ డిసెంబర్ 3న ఉదయం 8 గంటలకు రామగిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పెద్దపల్లి, మంథని, రామ గుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభ మవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తిం చుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గ దర్శకాలను పాటించాలని, ప్రతి కంట్రోల్ యూనిట్ లో నమోదయిన మొత్తం ఓట్ల వివరాలు చూపించి, తరువాత అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు అందరికి స్పష్టంగా తెలిసేలా చూపించాలని, ఆ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని




అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాలులో 14 టేబుల్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 21 రౌండ్లు, మంథని అసెంబ్లీ నియోజకవర్గంలో 20 రౌండ్లు, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో 18 రౌండ్లు ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభ మవుతుందని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 5 ఈవిఎం లను లాటరీ పద్ధతిన ఎంపిక చేసి, వివి ప్యాట్ల ఓట్ల లెక్కింపు చేయడం జరుగుతుందని అన్నారు. కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ప్రశాంతంగా వ్యవ హరిం చాలని, ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికి ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత ఆ రౌండ్ లో ప్రతి అభ్యర్థికి వచ్చిన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధికారికి అందించాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పోర్టల్ లో కూడా నమోదు చేయాలని, కంట్రోల్ యూనిట్లు ఓపెన్ కాని పక్షంలో రిటర్నింగ్ అధికారికి వెంటనే సమాచారం అందిం చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, రామగుండం, మంథని, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారులు జే.అరుణ శ్రీ, వి.హనుమా నాయక్ , సి.హెచ్. మధుసూధన్, తహసిల్దార్ లు, మంథని ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి టి.రవీందర్, డి.టి. ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215